PRGI NO:TGTEL/26/A0383
డైనమిక్
# జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM
తెలంగాణ గురువారం 08-10-2026 సంపుటి: 01 సంచిక : 270 పేజీలు : 12

## సిర్పూర్-కాగజ్‌నగర్ రైలులో మంటలు

బీబీనగర్ సమీపంలో ఘటన.
చక్రం రాపిడితో చెలరేగిన మంటలు.
అప్రమత్తమైన సిబ్బందితో తప్పిన ముప్పు.
ప్రయాణికులకు ఎలాంటి గాయాలు లేవు. 2



## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.

దర్శనానికి 12 గంటలు.
తిరుమల గిరులపై భక్తజన సందోహం.
టోకెన్లు లేకుండా వచ్చిన వారికి సర్వదర్శనానికి 12 గంటల సమయం.
భక్తులతో నిండిపోయిన 31 కంపార్ట్‌మెంట్లు.
మంగళవారం నాడు శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.33 కోట్లు. 2





## త్వరలో బీజేపీలో
# కీలక పదవి.

### బండి సంజయ్ నోట ఆసక్తికర మాటలు!

- బీజేపీ తనకు ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్న కేంద్ర మంత్రి.
- ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని వ్యాఖ్య.
- పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదని వెల్లడి.
- కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి డ్రామాలని విమర్శ.
- 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపణ.

**జనం వాయిస్, కరీంనగర్, అక్టోబర్ 7:**

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు త్వరలో తెలంగాణ బీజేపీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే ప్రచారం జరుగుతున్న వేళ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని, కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పడం అంతా డ్రామానేనని విమర్శించారు. - మిగతా 2 లో...

## యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు
# భట్టి సవాల్

- రూ.40 వేల కోట్ల భారం ఎవరిది?
- బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్ నిర్మించారా?
- గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ఉన్నా కోతలు లేవన్న భట్టి
- మూడు యూనిట్లకు బొగ్గు సరఫరా పునరుద్ధరించామన్న ఉప ముఖ్యమంత్రి.
- జెన్‌కో, ట్రాన్స్‌కో ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భట్టి.



**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 7:**

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే యాదాద్రి విద్యుత్ కేంద్రాన్ని నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ. 40 వేల కోట్ల భారం మోపారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారానికి ఎవరు బాధ్యత వహిస్తారో హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఇక పాదయాత్రల సీజన్!

- 2027లో తెలంగాణ రాజకీయ రణరంగం.
- అధికారమే లక్ష్యంగా పార్టీల వ్యూహాలు.
- ప్రజల్లోకి వెళ్లేందుకు నేతల కాలినడక బాట.
- కేటీఆర్ పాదయాత్రపై భారీ అంచనాలు.
- కవితదీ సమాంతర రాజకీయ బాట.
- కాంగ్రెస్‌ది అధికార పరిరక్షణ వ్యూహం.
- బీజేపీ, ఇతర నేతలూ రోడ్డెక్కేనా?



**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబరు 7:**

తెలంగాణ రాజకీయాలు రానున్న రోజుల్లో పూర్తిగా పల్లెబాట పట్టనున్నాయి. 2028 అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్‌గా భావిస్తున్న 2027లో రాష్ట్రం పాదయాత్రల రాజకీయానికి వేదికగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికారాన్ని దక్కించుకోవడానికి, నిలబెట్టుకోవడానికి ప్రజల్లోకి నేరుగా వెళ్లడమే లక్ష్యంగా అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ, ఇతర రాజకీయ నేతలు కాలినడకన ప్రజలను కలిసేందుకు వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారు. - మిగతా 2 లో...

## డిసెంబర్ తర్వాత నీటికి
# కటకటే!

హైదరాబాద్‌కు తాగునీటి గండం.
పడిపోతున్న జలాశయాల నీటిమట్టాలు.
13 శాతానికి చేరిన సింగూర్ నీటి నిల్వలు.
ప్రత్యామ్నాయ వనరులపై అధికారుల దృష్టి.
వర్షాభావంతో ముందుగానే ముంచుకొస్తున్న నీటి ఎద్దడి.


2

## ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.

ఢిల్లీలోని సీమాపురిలో కూలిన ఐదంతస్తుల భవనం.
శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానం.
ఘటనా స్థలంలో ముమ్మరంగా కొనసాగుతున్న సహాయక చర్యలు.
ఆ ప్రాంతానికి రావొద్దని ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు సూచన.


2

## ఏపీలో కొత్త విమానాశ్రయాలు

రామ్మోహన్ నాయుడు.
కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాలకు భూసేకరణ పూర్తయిందన్న రామ్మోహన్ నాయుడు.
భోగాపురం ఎయిర్‌పోర్టుతో పారిశ్రామికంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ధీమా.
విశాఖ ఎకనామిక్ రీజియన్ త్వరలోనే వాస్తవరూపం దాల్చుతుందన్న కేంద్ర మంత్రి.


2

## 2027 వరల్డ్‌కప్ తర్వాత కోహ్లీ రిటైర్ అవ్వడా? ఇంగ్లండ్ మాజీ స్టార్ సంచలన కామెంట్స్



12



## ఎస్సీ రోస్టర్‌లో మార్పులు చేస్తే ఉద్యమిస్తాం.

మంద కృష్ణ మాదిగ హెచ్చరిక.
మాదిగలకు 14 శాతం వాటా కల్పించాలని డిమాండ్.

PRGI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# సిర్పూర్-కాగజ్‌నగర్ రైలులో మంటలు

**జనం వాయిస్, యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 7:**

సిర్పూర్–కాగజ్‌నగర్ వెళ్లే రైలులో బుధవారం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘటన జరిగింది. రైలు ఓ బోగీ చక్రానికి బ్రేక్ లైనర్ పట్టేయడంతో ఏర్పడిన రాపిడి కారణంగా పొగలు, మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. రైలు బీబీనగర్ స్టేషన్ సమీపానికి చేరుకుంటున్న సమయంలో చక్రం నుంచి పొగలు రావడాన్ని కో–పైలట్ గమనించారు. వెంటనే లోకో పైలట్‌కు సమాచారం అందించడంతో రైలును బీబీనగర్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. అప్రమత్తంగా వ్యవహరించడంతో మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా నివారించగలిగారు. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ప్రయాణికులెవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. అనంతరం సాంకేతిక సిబ్బంది బోగీని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు పూర్తయిన తర్వాత రైలును తిరిగి సిర్పూర్–కాగజ్‌నగర్ వైపు పంపించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రైల్వే సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు.

# త్వరలో బీజేపీలో కీలక పదవి.

- మొదటి పేజీ తరువాయి..

బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపించారు. 1946లో కాంగ్రెస్ పీసీసీలన్నీ సర్దార్ పటేల్ ప్రధాని కావాలని ప్రతిపాదించినా.. నెహ్రూను ప్రధాని చేశారని విమర్శించారు. దేశంలో బోగస్ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్సే చెప్పిందని, ఇప్పుడు వాటిని తొలగిస్తుంటే ఎందుకు అభ్యంతరం చెబుతోందని ప్రశ్నించారు. ప్రధాని మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కుటుంబం, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు ఆయనకు అవసరం లేదని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు చెప్పే మాటలు నమ్మి యువత మోసపోవద్దని బండి సంజయ్ సూచించారు. 2014కు ముందు, ఇప్పటి భారత్‌ను పోల్చి చూడాలని కోరారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదన్నారు. రాజ్యాంగ సంస్థను బదనాం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ఎన్నికల సంఘాన్ని కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని రాహుల్ గాంధీకి సూచించారు. వందల మందితో వెళ్లి దాడి చేస్తే పోలీసులు అడ్డుకోక ఏం చేస్తారని ప్రశ్నించారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమన్నారు. తెలంగాణలో అక్రమ చొరబాటుదారుల ఓట్లపై కూడా బండి సంజయ్ ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోనే 30 వేలకు పైగా రోహింగ్యాల ఓట్లు ఉన్నాయని అన్నారు.

# డిసెంబర్ తర్వాత నీటికి కటకటే!

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 7:**

భాగ్యనగరానికి తాగునీటి గండం పొంచి ఉంది. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో నగరానికి ప్రధాన నీటి వనరులుగా ఉన్న జలాశయాల్లో నీటిమట్టాలు తగ్గిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే డిసెంబర్ లేదా జనవరి నుంచి హైదరాబాద్‌లో తాగునీటి సమస్య తీవ్రతరం అయ్యే అవకాశాలున్నాయి. పరిస్థితిని ముందుగానే అంచనా వేస్తున్న అధికారులు ప్రత్యామ్నాయ నీటి వనరుల గుర్తింపు, సరఫరా ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు.

### సింగూర్‌లో ఆందోళనకర పరిస్థితి

హైదరాబాద్ ఐటీ కారిడార్‌తో పాటు పశ్చిమ ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే సింగూర్ జలాశయంలో నీటి నిల్వలు గణనీయంగా పడిపోయాయి. ఈ జలాశయం పూర్తి నిల్వ సామర్థ్యం 29.9 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.9 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఇది మొత్తం సామర్థ్యంలో సుమారు 13 శాతం మాత్రమే. నీటి నిల్వలు మరింత తగ్గితే నగరంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేయడం సవాలుగా మారే అవకాశముంది.

### ఉస్మాన్‌సాగర్‌లోనూ తగ్గిన నీరు

పాతబస్తీతో పాటు నగరంలోని ఇతర ప్రాంతాలకు నీటిని అందించే ఉస్మాన్‌సాగర్ జలాశయంలోనూ నీటి నిల్వలు తగ్గుతున్నాయి. గతంలో సుమారు 3.5 టీఎంసీలుగా ఉన్న నిల్వలు ప్రస్తుతం 2.2 టీఎంసీలకు పడిపోయినట్లు సమాచారం. ఇతర ప్రధాన జలాశయాల్లోకి నీరు చేరే పరిమాణం కూడా తగ్గడంతో నగర తాగునీటి సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతోంది.

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి

పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ జలమండలి అధికారులు అప్రమత్తమయ్యారు. సింగూర్, మంజీరా జలాలపై ఆధారపడిన ప్రాంతాలకు ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించాలని, అవసరమైతే సరఫరా మార్గాల్లో మార్పులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు సమాచారం. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించారు.

### వర్షపాతం లోటుతో ఇబ్బందులు

రాష్ట్రంలో వర్షపాతం లోటు కూడా నీటి వనరులపై ప్రభావం చూపుతోంది. సాధారణంగా వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడి ఈసారి ముందుగానే తలెత్తే అవకాశాలున్నాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. తాగునీటికి ప్రాధాన్యం ఇస్తూ అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. జలాశయాల నిల్వలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంది.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.

**జనం వాయిస్, తిరుమల, అక్టోబర్ 7:**

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. బుధవారం ఉదయం నాటికి, శ్రీవారి దర్శనం కోసం 31 వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 12 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. మంగళవారం (అక్టోబర్ 6) ఒక్కరోజే 73,629 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 27,525 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.33 కోట్లుగా నమోదైంది. అదేవిధంగా, టీటీడీ నిన్న 3.91 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సత్రంలో 1.75 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో 3,334 మందికి వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ నేపథ్యంలో టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తోంది.



# యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 7:**

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే యాదాద్రి విద్యుత్ కేంద్రాన్ని నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ.40 వేల కోట్ల భారం మోపారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారానికి ఎవరు బాధ్యత వహిస్తారో హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు అనుసంధానం కల్పిస్తామని హామీ ఇచ్చి యాదాద్రి విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అయితే విద్యుత్ కేంద్రానికి అవసరమైన జీ9 రకం బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని తెలిపారు. సింగరేణి నుంచి 70 లక్షల టన్నులు, మిగిలిన బొగ్గును దిగుమతి చేసుకునేలా ఒప్పందాలు ఉన్నప్పటికీ.. గత ప్రభుత్వం వాటిని అమలు చేయలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే విద్యుత్ కేంద్రాన్ని నిర్మించారా? లేక అవసరమైన ఏర్పాట్లు చేశారా? అనే విషయంపై



హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలని భట్టి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలపై పడిన రూ.40 వేల కోట్ల భారానికి ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలని నిలదీశారు.

### మూడు యూనిట్లకు బొగ్గు సరఫరా

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బొగ్గు సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు భట్టి తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులను సమన్వయం చేసుకుని యాదాద్రి విద్యుత్ కేంద్రంలోని మూడు యూనిట్లను ప్రారంభించామని వివరించారు.

### విద్యుత్ కోతలు లేవు

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్‌కు గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని భట్టి తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా సరఫరా చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందించాల్సింది పోయి అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు.

### ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవం

జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థలను ప్రైవేటీకరిస్తారంటూ వస్తున్న వార్తలను భట్టి విక్రమార్క ఖండించారు. విద్యుత్ రంగంపై ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం అనవసర ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. తమ ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని, విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు.

# ఇక పాదయాత్రల సీజన్!

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబరు 7:**

తెలంగాణ రాజకీయాలు రానున్న రోజుల్లో పూర్తిగా పల్లెబాట పట్టనున్నాయి. 2028 అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్‌గా భావిస్తున్న 2027లో రాష్ట్రం పాదయాత్రల రాజకీయానికి వేదికగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికారాన్ని దక్కించుకోవడానికి, నిలబెట్టుకోవడానికి ప్రజల్లోకి నేరుగా వెళ్లడమే లక్ష్యంగా అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ, ఇతర రాజకీయ నేతలు కాలినడకన ప్రజలను కలిసేందుకు వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారు.

### కేటీఆర్ పాదయాత్రపై భారీ అంచనాలు

అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్‌ను మళ్లీ ప్రజల్లో బలోపేతం చేయడమే లక్ష్యంగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపేందుకు ఈ పాదయాత్రను కీలక అస్త్రంగా మలచుకునే అవకాశం ఉంది.

### కవితదీ సమాంతర రాజకీయ బాట

తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయంగా ముందుకు సాగుతున్న కల్వకుంట్ల కవిత కూడా ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లేందుకు పాదయాత్ర ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మహిళలు, సింగరేణి కార్మికులు, క్షేత్రస్థాయి వర్గాలతో మమేకమయ్యేలా ఆమె కార్యాచరణ రూపొందించుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### కాంగ్రెస్‌ది అధికార పరిరక్షణ వ్యూహం

ప్రతిపక్షాలకు రాజకీయంగా అవకాశం ఇవ్వకుండా ప్రజల్లో తమ పట్టు కొనసాగించేందుకు కాంగ్రెస్ కూడా పాదయాత్రల వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీల అమలును ప్రజలకు వివరించేలా రాష్ట్రవ్యాప్త పర్యటనకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### భట్టి, మహేష్ కుమార్ గౌడ్ కూడా ప్రజల్లోకి

ముఖ్యమంత్రికి తోడుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ వేర్వేరు ప్రాంతాలను ఎంచుకుని ప్రజల్లోకి వెళ్లేలా కార్యాచరణ రూపొందించనున్నట్లు సమాచారం. గతంలో భట్టి విక్రమార్క చేపట్టిన ప్రజా మార్చ్ కాంగ్రెస్‌కు రాజకీయంగా కలిసివచ్చిన నేపథ్యంలో ఈసారి కూడా పాదయాత్రలను అధికార పరిరక్షణకు కీలక అస్త్రంగా మలచుకోవాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### బీజేపీ, ఇతర నేతలూ రోడ్డెక్కనా?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుతో పాటు పలువురు కాషాయ నేతలు ప్రజా సమస్యలపై పాదయాత్రల ద్వారా ప్రజల్లోకి వెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు



సమాచారం. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కూడా ప్రజా సమస్యలను ప్రధానంగా చేసుకుని తనదైన శైలిలో ప్రజల్లోకి వెళ్లే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

### ఎవరి నడకకు ప్రజల మద్దతు?

ఒకేసారి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు ఇతర రాజకీయ నేతలు పాదయాత్రలతో ప్రజల్లోకి వస్తే తెలంగాణ రాజకీయ వాతావరణం మరింత వేడెక్కడం ఖాయం. ఎవరి నడకకు ప్రజల మద్దతు లభిస్తుంది? ఎవరి పాదయాత్ర రాజకీయంగా ఫలితాన్నిస్తుంది? అన్నది ఆసక్తికరంగా మారనుంది. ఎన్నికలకు ముందే మొదలయ్యే ఈ పాదయాత్రలతో 2027లో తెలంగాణ రాజకీయాలు తారాస్థాయికి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.

**జనం వాయిస్, ఢిల్లీ, అక్టోబర్ 7:**

దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈశాన్య ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో ఉన్న ఓ ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో పలువురు శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే ఢిల్లీ ఫైర్ సర్వీస్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాయి. మధ్యాహ్నం సుమారు 3:30 గంటల సమయంలో భవనం కూలినట్లు సమాచారం అందిందని అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం శిథిలాలను తొలగించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. సహాయక చర్యల్లో ఫైర్ సర్వీస్ సిబ్బందితో పాటు స్థానికులు కూడా భాగస్వాములవుతున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు కొందరు కాంక్రీట్ పెళ్లలను చేతులతో తొలగించే ప్రయత్నం చేస్తుండగా, మరికొందరు ఈ విషాద దృశ్యాలను తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించారు. ఈ ప్రమాదం దృష్ట్యా ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు కీలక సూచనలు జారీ చేశారు. అంబులెన్సులు, సహాయక వాహనాలు వేగంగా ఘటనా స్థలానికి చేరుకోవడానికి వీలుగా సీమాపురి గోల్ చక్కర్, డీఎల్ఎఫ్ భోపురా పరిసర ప్రాంతాలకు ప్రజలు ఎవరూ రావొద్దని 'ఎక్స్' వేదికగా విజ్ఞప్తి చేశారు. గత కొద్ది రోజుల క్రితమే సత్యనికేతన్ ప్రాంతంలో ఓ హాస్టల్ భవనం కూలి ఏడుగురు మరణించిన ఘటన మరువక ముందే, మరో భవనం కుప్పకూలడం ఢిల్లీ వాసులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

# 2027 వరల్డ్‌కప్ తర్వాత కోహ్లీ రిటైర్ అవ్వడా? ఇంగ్లండ్ మాజీ స్టార్ సంచలన కామెంట్స్

**జనం వాయిస్, ఢిల్లీ, అక్టోబర్ 7:**



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే వరల్డ్‌కప్ తనకు చివరిదని కోహ్లీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ టోర్నీ తర్వాత కూడా కోహ్లీ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పకపోవచ్చని పనేసర్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల వన్డేల్లో కోహ్లీ 15 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఈ సందర్భంగా కోహ్లీ ఆటపై పనేసర్ ప్రశంసలు కురిపించాడు. అతడిలో ఆటపై ఆకలి, దూకుడు, ఫిట్‌నెస్‌పై శ్రద్ధ తనను ఆకట్టుకుంటున్నాయని చెప్పాడు. కోహ్లీ శిక్షణ చూస్తే తాను కూడా జిమ్‌కు వెళ్లాలనిపిస్తుందని పేర్కొన్నాడు. "విరాట్‌లో ఇప్పటికీ పరుగులు చేయాలనే ఆకలి చాలా ఉంది. ప్రతి మ్యాచ్‌ను ఎంతో తీవ్రతతో ఆడతాడు. ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తాడు. చుట్టూ ఉన్న వారిని కూడా ప్రోత్సహిస్తాడు. 10–15 మ్యాచ్‌లే మిగిలి ఉన్నాయని భావిస్తే ప్రతి మ్యాచ్‌ను ప్రత్యేకంగా చూస్తాం. కోహ్లీ కూడా ప్రస్తుతం అదే మైండ్‌సెట్‌తో ఆడుతున్నాడు. ప్రతి బంతికి తన వంద శాతం ఇస్తున్నాడు. అందుకే వరల్డ్‌కప్ తర్వాత అతడు రిటైర్ అవుతాడని నాకు అనిపించడం లేదు. అతడి నుంచి ఇంకా చాలా క్రికెట్ చూడొచ్చు" అని పనేసర్ చెప్పాడు. మరోవైపు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మపైనా పనేసర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ గొప్ప ఆటగాడని, అతడికి ప్రపంచకప్ జట్టులో అవకాశం ఇవ్వాలని అన్నాడు. రోహిత్ క్రీజులో కుదురుకుంటే విధ్వంసకరంగా బ్యాటింగ్ చేయగలడని పేర్కొన్నాడు. "రోహిత్ అద్భుతమైన ఆటగాడు. అతడు ఫామ్‌లోకి వస్తే బ్యాటింగ్‌తో ప్రత్యర్థులను చిత్తు చేయగలడు. భారత్‌కు అతడి లాంటి నాణ్యమైన ఆటగాడు అవసరం" అని పనేసర్ చెప్పాడు.

# ఏపీలో కొత్త విమానాశ్రయాలు

**జనం వాయిస్, అమరావతి, అక్టోబర్ 7:**



ఏపీలో కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం, కుప్పం, నాగార్జున సాగర్ సమీపంలో, అమరావతి వంటి ప్రాంతాల్లో ఈ నూతన విమానాశ్రయాలు రానున్నాయని చెప్పారు. ఇప్పటికే శ్రీకాకుళం, కుప్పం ఎయిర్‌పోర్టులకు భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని మంత్రి స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో ఉత్తరాంధ్ర ప్రాంతం ఒక మినీ ఎకనామిక్ సిటీగా రూపాంతరం చెందనుందని కేంద్ర మంత్రి అన్నారు. ఈ ఎయిర్‌పోర్టు ఈ ప్రాంత అభివృద్ధికి ఒక చోదకశక్తిగా పనిచేస్తుందని, వలసలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో భారీ పారిశ్రామిక అభివృద్ధి జరగనుందని, భోగాపురం విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'విశాఖ ఎకనామిక్ రీజియన్' కూడా త్వరలోనే వాస్తవరూపం దాల్చనుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

# ఎస్సీ రోస్టర్‌లో మార్పులు చేస్తే ఉద్యమిస్తాం.

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబరు 7:**

ఎస్సీ రోస్టర్ పాయింట్లలో మార్పులు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణలో జనాభా ప్రాతిపదికన మాదిగలకు తగిన వాటా దక్కలేదని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట మంగళవారం రాత్రి జరిగిన ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లను పెంచి, వర్గీకరణకు అనుగుణంగా మాదిగలకు 14 శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు.



### సీఎం హామీ అమలు చేయాలి

జనాభా లెక్కలు పూర్తయిన తర్వాత ఎస్సీ రిజర్వేషన్లను పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని మంద కృష్ణ కోరారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత రోస్టర్ సవరణ పేరుతో మరో వివాదానికి తెరతీయడం సరికాదన్నారు.

### ఐక్యంగా ఉద్యమిద్దాం

కుల వివక్ష నిర్మూలన, సామాజిక న్యాయం కోసం మాలలు సహా అన్ని సామాజిక వర్గాలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని కోరారు. సంక్షేమ హాస్టళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై వచ్చే మార్చిలో 'ఛలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలను కలుపుకుని సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతల నిర్మూలన కోసం ఉద్యమాలను కొనసాగిస్తామని మంద కృష్ణ తెలిపారు.

PRGI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# సీతాఫలానికి కష్టకాలం.

**తగ్గిన దిగుబడి.. పెరిగిన ధరలు.**
**ఎల్‌నినో ప్రభావంతో పూత, పిందె దశలోనే దెబ్బతిన్న పంట.**
**కాయలు లేక ఉపాధి కోల్పోతున్న గ్రామీణ ప్రజలు.**
**ఖాళీగా ఉంటున్న మహిళా సంఘాల ప్రాసెసింగ్ కేంద్రాలు.**





**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 7:**

ఒకప్పుడు గుట్టలు, బంజరు భూములు, అటవీ ప్రాంతాల్లో విస్తారంగా కనిపించిన సీతాఫలాలు ఇప్పుడు అరుదుగా మారుతున్నాయి. ఒకవైపు ఎల్‌నినో ప్రభావం, మరోవైపు వర్షాభావ పరిస్థితులు, పెరిగిన ఉష్ణోగ్రతలు సీతాఫలాల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పూత దశ నుంచే ప్రతికూల పరిస్థితులు ఎదురవడంతో పిందెలు రాలిపోతున్నాయి. చెట్లకు మిగిలిన కాయలు సైతం పూర్తిస్థాయిలో ఎదగకుండానే దెబ్బతింటున్నాయి. దిగుబడి గణనీయంగా తగ్గడంతో మార్కెట్‌లో సీతాఫలాల సరఫరా తగ్గి ధరలు పెరిగాయి. సాధారణంగా ఒక్కో చెట్టుకు 50 నుంచి 60 కాయల వరకు కాసే పరిస్థితి ఉండగా, ఈసారి చాలా చెట్లకు పది కాయలు కూడా కనిపించడం లేదని తెలుస్తోంది. జూలై, ఆగస్టు నెలల్లో పూత పిందెలుగా మారే సమయంలో తగిన వర్షాలు లేకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగడం వల్ల పిందెలు రాలిపోయాయి. సీతాఫలాల కొరతతో పట్టణ ప్రాంతాల్లో ధరలు కూడా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి నాణ్యత, బరువును బట్టి ఒక్కో పండు రూ.30 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సీతాఫలాలను సేకరించి విక్రయించే కుటుంబాలకు కూడా ఈ పరిస్థితి ఉపాధిపై ప్రభావం చూపుతోంది. సీతాఫలాల సేకరణ అనంతరం వాటిని ప్రాసెసింగ్ చేసి విక్రయించే మహిళా సంఘాలపైనా ప్రభావం పడింది. గతేడాది ఇదే సమయంలో ప్రాసెసింగ్ పనులు జోరుగా సాగగా, ఈసారి సరిపడా పండ్లు అందుబాటులో లేక పనులు మందగించాయి. మరోవైపు గుట్టల తొలగింపు, క్వారీల విస్తరణ, రియల్ ఎస్టేట్ వెంచర్లు, భూముల వినియోగంలో మార్పులతో సహజంగా పెరిగే సీతాఫలం చెట్ల విస్తీర్ణం కూడా తగ్గుతోంది. వాతావరణ పరిస్థితులతో పాటు సహజ సీతాఫలం చెట్ల సంఖ్య తగ్గిపోవడం భవిష్యత్తులో ఈ పండ్ల లభ్యతపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. వచ్చే సీజన్‌లోనైనా వర్షాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలించి సీతాఫలం దిగుబడి పెరుగుతుందా అన్నది చూడాలి.

# ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి.

**జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.**
**గోదావరిఖనిలో అఖిలపక్షాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.**

**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 7:**

పౌరుల రాజ్యాంగబద్ధ ప్రాథమిక హక్కు అయిన ఓటు హక్కును ఎలాంటి అనుమతి లేకుండా తొలగించే అధికారం ఎవరికీ లేదని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గోదావరిఖనిలో అఖిలపక్షాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో గోదావరిఖని చౌరస్తా నుంచి మున్సిపల్ టీ జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా "మోదీ హటావో.. దేశ్ బచావో, బీజేపీ హటావో.. దేశ్ బచావో, జ్ఞానేష్ కుమార్ హటావో.. దేశ్ బచావో" అంటూ నినాదాలు చేశారు. ఎస్ఐఆర్ పేరుతో బీజేపీ వ్యతిరేకులు, మైనార్టీలు, దళితులను ఓటు హక్కుకు దూరం చేసే కుట్ర జరుగుతోందని నాయకులు ఆరోపించారు. ఓటు హక్కును పరిరక్షించడంతో పాటు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని, పౌరుల ఓటు హక్కుకు రక్షణ కల్పించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఈ. నరేష్, తోకల రమేష్, ఐ. రాజేశం, ఎం. దుర్గయ్య, ఎం. కొమరయ్య, కే. ధర్మేందర్, పులిపాక మల్లేష్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- అడవిశ్రీరాంపూర్‌లో అటవీ, పోలీసు శాఖల సంయుక్త తనిఖీలు.
- వేట వలలు, ఉచ్చులు, ఇనుప బోను స్వాధీనం.







**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 7:**

వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి సమిష్టి బాధ్యత అని మంథని అటవీశాఖ అధికారి ఎం.వి. నాయక్ అన్నారు. జిల్లా అటవీ అధికారి ఆదేశాల మేరకు బుధవారం ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో మంథని, పెద్దపల్లి అటవీ శాఖ సిబ్బంది, ముత్తారం పోలీసుల సహకారంతో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 2 వేట వలలు, 20 ఉచ్చులు, ఒక ఇనుప బోను, 2 కిలోల బైండింగ్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.వి. నాయక్ మాట్లాడుతూ చెట్లను అక్రమంగా నరికివేయడం, వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అటవీ వనరులు, వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. అక్రమ వేటకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం దర్యాపూర్ తెలంగాణ రాష్ట్ర నమూనా పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులు, సిబ్బందికి వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం అడవిశ్రీరాంపూర్ బీట్ పరిధిలోని 444వ విభాగం రిజర్వు అటవీ ప్రాంతంలో పర్యటించారు. మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మంథని ఎఫ్ఆర్ఓ ఎం.వినయ్ నాయక్, పెద్దపల్లి ఎఫ్ఆర్ఓ టి.సతీష్ కుమార్, డిప్యూటీ రేంజ్ అధికారులు పి.దేవదాస్, ఎన్.రమేష్, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు ఎం.నరసయ్య, హెచ్.మంగీలాల్, ఎస్.డి.రహిమతుల్లా, ఎం.డి.అమీర్‌ఉద్దీన్, ముదస్సర్ షా ఖాన్, నహీదా పర్వీన్, ఫారెస్ట్ బీట్ అధికారులు కె.పవన్ కుమార్, ఎం.శ్రీకాంత్, ఎస్.మేఘ రాజు, కె.తిరుపతి, పి.రంజిత, ఎస్.శ్రావంతి, ఎ.మాధురి, ఎస్.ప్రదీప్, క్షేత్ర జీవశాస్త్రవేత్త ఎం.చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి చిన్నారులకు పలుకలు పంపిణీ.

**చిన్నారులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలి: ఏట సంపత్.**

**జనం వాయిస్, ముత్తారం, అక్టోబర్ 7:**

ముత్తారం మండలం ఖమ్మంపల్లి అంగన్వాడి కేంద్రం-4లో చిన్నారులకు బహుజన్ సమాజ్ పార్టీ మంథని నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఏట సంపత్ పలుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, చిన్నారులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఏట సంపత్ ఆకాంక్షించారు. సమాజంలో ఒక వ్యక్తిగా మాత్రమే కాకుండా వ్యవస్థగా ఎదిగి తల్లిదండ్రులకు, ప్రజలకు సేవ చేయాలని సూచించారు. కుల, మత భేదాలకు అతీతంగా అందరినీ గౌరవిస్తూ ఐక్యతతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ తిరుమల, సహాయకురాలు కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.



# సీఎంపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

**పెండింగ్‌లో ఉన్న స్లిప్పులు, రుణాలు, పింఛన్లు వెంటనే మంజూరు చేయాలి.**
**సీఎంపీఎఫ్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ధర్నా.**
**కమిషనర్‌కు డిమాండ్లతో వినతిపత్రం అందజేసిన సీతారామయ్య.**





**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబరు 7:**

సింగరేణి కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని ఐబీ కాలనీలోని సీఎంపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఆధ్వర్యంలో సీఎంపీఎఫ్ కమిషనర్ గోవర్ధన్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాలో సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, పదవీ విరమణ చేసిన కార్మికులకు సంబంధించిన పలు సీఎంపీఎఫ్ సమస్యలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 2024-25, 2025-26 సంవత్సరాలకు సంబంధించిన సీఎంపీఎఫ్ స్లిప్పులు శాశ్వత, కాంట్రాక్టు కార్మికులకు అందకపోవడంతో తమ ఖాతాల్లోని నిల్వలు తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వివిధ అవసరాల కోసం కార్మికులు దరఖాస్తు చేసుకున్న సీఎంపీఎఫ్ రుణాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన కార్మికులకు పింఛన్లు మంజూరు కాక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మరణించిన పింఛనుదారుల అర్హులైన కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ నెలల తరబడి పింఛన్లు మంజూరు కావడం లేదని పేర్కొన్నారు. సీఎంపీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీ-కేర్ దరఖాస్తు సక్రమంగా పనిచేయకపోవడంతో పాటు వివరాలు సకాలంలో నవీకరణ కాక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పదవీ విరమణ చేసిన కార్మికులు, ఉద్యోగులకు సవరించిన పింఛను చెల్లింపు ఉత్తర్వుల ప్రతులు అందకపోవడం వల్ల కూడా సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సీఎంపీఎఫ్ సమస్యలను గుర్తించి యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, కార్మికులకు అవసరమైన స్లిప్పులు, రుణాలు, పింఛన్లు, సవరించిన పింఛను చెల్లింపు ఉత్తర్వుల ప్రతులను వెంటనే అందించాలని సీతారామయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్, కందికట్ల వీరభద్రం, కేంద్ర కార్యదర్శులు కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం, బ్రాంచి కార్యదర్శులు బాజి సైదా, తిరుపతి, కొట్టె కిషన్‌రావు, అక్బర్ అలీ, రంగు శ్రీను, గందం సాంబశివరావు, ఎం.ఆర్.సి. రెడ్డి, బుర్ర తిరుపతి, ఎం.ఎ. గౌస్‌తో పాటు శ్రీరాంపూర్, గోలేటి, రామగుండం ప్రాంతాలకు చెందిన కార్యవర్గ సభ్యులు, గని కార్యదర్శులు, గని భద్రతా కమిటీ సభ్యులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా రవికుమార్

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 7:**



మంథని మండలం విలోచవరం గ్రామంలోని ప్రముఖ పురాతన దేవాలయాలైన శ్రీ పర్వతాల మల్లికార్జున స్వామి, శ్రీ రామాలయం, శ్రీ సాయిబాబా ఉమ్మడి ఆలయాల అభివృద్ధి కోసం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం దేవాలయ ఆవరణలో గ్రామ పెద్దలు, రైతులు, భక్తుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ చైర్మన్‌గా కావేటి రవికుమార్, వైస్ చైర్మన్‌గా జూనగిరి సుమన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బీముని రాజమల్లు గౌడ్, పుట్ట సంతోష్, బోగిరి కార్తీక్, కొరవేణి మధుకర్, ఎరుకల సుధాకర్, కొండ దేవేందర్, తోటపెల్లి ప్రశాంత్, గుర్రాల సంతోష్, కౌటం రాజేష్‌లను ఎన్నుకున్నారు.

**ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం**

ఈ సందర్భంగా నూతన చైర్మన్ కావేటి రవికుమార్ మాట్లాడుతూ గ్రామంలోని పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఆలయాలకు వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కమిటీ తరఫున శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధికి గ్రామ ప్రజలు, భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# గెస్ట్ ప్రత్యేక అవసరాల విద్యాబోధకుల నియామకానికి దరఖాస్తులు

**11 పాఠశాలల్లో ఖాళీలు.. నెలకు రూ.16,500 గౌరవ వేతనం.**
**ఈ నెల 10లోపు దరఖాస్తులు సమర్పించాలి: డీఈఓ జి. శారద.**

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 7:**



పెద్దపల్లి జిల్లాలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలోని 11 పీఎం శ్రీ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యాబోధన చేసేందుకు తాత్కాలిక పద్ధతిలో గెస్ట్ ప్రత్యేక అవసరాల విద్యాబోధకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద తెలిపారు. ఐదు నెలల కాలానికి చేపట్టే ఈ నియామకంలో ఎంపికైన వారికి నెలకు రూ. 16,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. పీఎం శ్రీ రామగుండం, జడ్పీహెచ్ఎస్ కమాన్‌పూర్, అప్పన్నపేట, పోత్కపల్లి, ఏక్లాస్‌పూర్, టీజీడబ్ల్యూఆర్ఈఐఎస్ మేడారం, మల్లాపూర్, టీజీఎంఎస్ రామగుండం, జూలపల్లి, మల్యాల (శ్రీరాంపూర్), టీజీడబ్ల్యూఆర్ఈఐఎస్ మంథని పాఠశాలల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 10లోపు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లేదా ప్రిన్సిపాళ్లకు దరఖాస్తుతో పాటు ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సంబంధిత విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని డీఈఓ జి. శారద కోరారు.

# చిన్నారుల ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరం.

***రామగుండంలో నేటితో ముగియనున్న శిబిరం.***
***తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష.***

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 7:**



ఐదేళ్లలోపు చిన్నారుల ఆధార్ నమోదు కోసం రామగుండం ఐసీడీఎస్ కార్యాలయంలో రెండు రోజుల ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. అక్టోబర్ 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్న శిబిరం తొలిరోజు బుధవారం విజయవంతంగా కొనసాగింది. రామగుండం పరిధిలోని ఐదేళ్లలోపు చిన్నారుల తల్లిదండ్రులు, సంరక్షకులు అక్టోబర్ 8న కూడా శిబిరానికి హాజరై తమ పిల్లల ఆధార్ నమోదు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు భవిష్యత్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య తదితర అవసరాలకు ఆధార్ సేవలు అందుబాటులో ఉండేలా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు.**
**అనుమానాస్పద లింకులు, సందేశాలకు స్పందించవద్దు: సీపీ అంబర్ కిషోర్ ఝా.**

**జనం వాయిస్, మంచిర్యాల, అక్టోబర్ 7:**






సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత, కుటుంబ, ఆర్థిక వివరాలను బహిర్గతం చేయవద్దని హెచ్చరించారు. జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసంలో భాగంగా బుధవారం మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక మాధ్యమాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని, అనుమానాస్పద అనువర్తనాలను డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. రైతుల నమోదు, ఎరువుల అనువర్తనం వంటి పేర్లతో ఫోన్ చేసి ఒకసారి ఉపయోగించే సంకేత సంఖ్య, వ్యక్తిగత లేదా బ్యాంకు వివరాలు అడిగితే ఇవ్వవద్దన్నారు. "ఆగండి.. ఆలోచించండి.. ధృవీకరించండి" అనే విధానాన్ని పాటించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే జాతీయ సైబర్ నేరాల సహాయవాణి 1930కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం సైబర్ భద్రత అవగాహన పోస్టర్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా పోలీసు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, ఏసీపీలు ఆర్.ప్రకాష్, డి.వి.రంగారెడ్డి, పోలీసు అధికారులు, సైబర్ నేర విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

PRGI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన

# మంత్రి శ్రీధర్ బాబు

**జనం వాయిస్, రామగిరి, అక్టోబర్ 7:**

రామగిరి మండలం సుందిల్ల గ్రామానికి చెందిన ప్రముఖ సుందిల్ల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ చైర్మన్ కొరకొప్పుల సత్యనారాయణ గౌడ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం సుందిల్ల గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి శ్రీధర్ బాబు, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారిని ఓదార్చి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్‌తో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామస్తులు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.




## అంజలి వైద్యానికి దాతల ఆపన్నహస్తం

### రూ.13,912 ఆర్థిక సాయం అందజేత..

### దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు

**జనం వాయిస్, మందమర్రి: అక్టోబర్ 7:**



ఆపదలో ఉన్న పేద కుటుంబానికి దాతలు అండగా నిలిచారు. మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామానికి చెందిన బండారి అంజలి ఆస్పత్రి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న దాతలు మానవతా దృక్పథంతో స్పందించి రూ.13,912 ఆర్థిక సహాయాన్ని అందించారు. సేకరించిన మొత్తాన్ని బాధిత కుటుంబానికి దాతల తరపున అందజేశారు. పేదింటి బిడ్డ వైద్య ఖర్చుల కోసం సహాయం కోరగానే స్పందించి, తమకు తోచినంత సాయం అందించిన ప్రతి దాతకు డా. భీంపుత్ర శ్రీనివాస్ జలంపెల్లి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలిచిన దాతల మానవతా దృక్పథం అభినందనీయమని పేర్కొన్నారు. "అంజలి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. ఆమె కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు" అని డా. శ్రీనివాస్ జలంపెల్లి తెలిపారు. ఈ సహాయ కార్యక్రమంలో కోవిడ్ వాలంటీర్స్--నెన్నెల, సోపతి వెల్ఫేర్ సొసైటీ--జైపూర్, భీంపుత్ర ఫౌండేషన్ భాగస్వాములయ్యారు.

## పరారీలో ఉన్న గంజాయి నిందితుడి అరెస్ట్

- చింతపల్లి టోల్‌ప్లాజా వద్ద 4 కిలోల గంజాయి పట్టివేత కేసు.
- రెండేళ్ల తర్వాత పోలీసులకు చిక్కిన నిందితుడు.

**కురవి, అక్టోబర్ 7 (జనం వాయిస్) :**




గంజాయి అక్రమ రవాణా కేసులో గత రెండేళ్లుగా పరారీలో ఉన్న నిందితుడిని సీరోలు పోలీసులు పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 2024లో చింతపల్లి టోల్‌ప్లాజా వద్ద 4 కిలోల గంజాయి పట్టుబడిన కేసులో నిందితుడిగా ఉన్న ధీరావత్ బాలాజీని తాజాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు వివరాల ప్రకారం.. 2024 ఫిబ్రవరి 27న సీరోలు పోలీసులు చింతపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఇద్దరు వ్యక్తులు స్కూటీపై అక్కడికి రాగా, పోలీసులు వారిని ఆపేందుకు ప్రయత్నించారు. దీంతో స్కూటీపై వెనుక కూర్చున్న వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. అనుమానంతో స్కూటీని తనిఖీ చేయగా అందులో 4 కిలోల గంజాయి లభించింది. దీంతో స్కూటీ నడుపుతున్న జెగ్రిపోతుల మధుతో పాటు పరారైన ధీరావత్ బాలాజీపై ఎన్డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. జెగ్రిపోతుల మధును అప్పట్లోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, బాలాజీ మాత్రం పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు కొనసాగించిన గాలింపు చర్యల్లో భాగంగా తాజాగా ధీరావత్ బాలాజీని పట్టుకుని అరెస్టు చేశారు. అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా మరిపెడ సీఐ ఎల్. పవన్ కుమార్ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని ఏమాత్రం ఉపేక్షించబోమన్నారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. తమ ప్రాంతంలో ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలను విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

## సోమేశ్వర ఆలయంలో ఈనెల 9న హుండీ లెక్కింపు.

**అక్టోబర్ 7 జనంవాయిస్ పాలకుర్తి:**



పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన స్వయంభూ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 9న శుక్రవారం ఉదయం 10:30 గంటలకు హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆలయంలోని కళ్యాణ మండపంలో హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు..

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి: అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు.**

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబరు 7:**

ఖరీఫ్-2026 ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పంట కోతల షెడ్యూల్‌కు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. ఎఫ్ఏక్యూ నాణ్యత



ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన గన్నీ బ్యాగులు, ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం నిల్వకు అవసరమైన స్థలాలను ముందుగానే గుర్తించాలని, ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు, తూకం యంత్రాలు, తేమ శాతం కొలిచే పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు అవసరమైన శిక్షణ అందించి, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా




శాఖల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల తాగునీటి సమస్యకు పరిష్కారం

- సర్పంచ్ చిందం మహేష్ ఆధ్వర్యంలో జోన్-2లో రెండు నూతన బోర్లు.
- కార్మిక కుటుంబాల తాగునీటి కష్టాలకు చెక్ పెట్టిన చిందం మహేష్.
- వార్డు సభ్యుల సహకారంతో పనులు పూర్తి.

**జనం వాయిస్, రామగిరి, అక్టోబర్ 7:**

రామగిరి మండలం పన్నూరు గ్రామపంచాయతీ పరిధిలోని సింగరేణి జోన్-2 క్వార్టర్స్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. పన్నూరు



సర్పంచ్ చిందం మహేష్ ఆధ్వర్యంలో కార్మిక కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండు నూతన బోర్లను ఏర్పాటు చేయించారు. కొంతకాలంగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మిక కుటుంబాలకు నూతన బోర్ల ఏర్పాటుతో ఉపశమనం లభించనుంది. గ్రామపంచాయతీ వార్డు సభ్యుల సహకారంతో ఈ పనులను చేపట్టారు. "సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడటం మా బాధ్యత. సమస్య నా దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకున్నాం. ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది



సహకారంతో రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం" అని సర్పంచ్ చిందం మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల ఎంపీఓ సమ్మిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఉప సర్పంచ్ కావేటి మల్లేశ్వరి, వార్డు సభ్యులు తాండ్ర ప్రశాంత్, అరుణ, మున్ని స్వప్న వైష్ణవి, రమాదేవి, చేతి సుధాకర్, సలపాల సదానందం, తన్నీరు ప్రదీప్, కుంట విజయ్‌కుమార్, వైష్ణవి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణ కోసం భారీ నిరసన ర్యాలీ

- ఎండీ ముస్తఫా ఆధ్వర్యంలో కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీల ఆందోళన.
- ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, దుద్దిళ్ల శ్రీను బాబు.
- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం.

**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 7:**

ఓటు హక్కు పరిరక్షణ, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చూడాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీల ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, 54వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ముస్తఫా ఆధ్వర్యంలో మెయిన్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన



కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు.

### ఎస్ఐఆర్‌లో పారదర్శకత పాటించాలి

ర్యాలీ అనంతరం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించకుండా ఎన్నికల సంఘం పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో మార్పులు, తొలగింపులపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.



### ఓటు హక్కును కాపాడాలి

ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని నాయకులు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తే ప్రజాస్వామ్య ప్రక్రియకు నష్టం వాటిల్లుతుందని అన్నారు. ఎస్ఐఆర్‌పై తలెత్తుతున్న అనుమానాలు, అభ్యంతరాలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, ఐఎన్‌టీయూసీ తదితర ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ సామాజిక సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నారపల్లికి పాదచారుల వంతెనలు అత్యవసరం

- వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దివ్యాంగుల భద్రతకు లిఫ్ట్ సౌకర్యం కల్పించాలి.
- వరంగల్ జాతీయ రహదారిపై పెరుగుతున్న రద్దీతో తప్పని ప్రమాద ముప్పు.
- యుద్ధప్రాతిపదికన వంతెనల నిర్మాణం చేపట్టాలి: ఆళవందార్ వేణు మాధవ్.



**జనం వాయిస్, నారపల్లి, అక్టోబర్ 7:**

హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న నారపల్లి ప్రాంతంలో పాదచారుల భద్రత కోసం పాదచారుల వంతెనలు నిర్మించాలని డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ కోరారు. నారపల్లి బస్‌స్టాప్ వరంగల్ జాతీయ



రహదారికి ఆనుకుని ఉండటంతో పాటు కొర్రెముల, చౌదరిగూడ తదితర ప్రాంతాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. నారపల్లి ప్రాంతంలో కాలనీలు, విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార కేంద్రాలు, పరిశ్రమలు పెరగడంతో వాహనాల రద్దీ గణనీయంగా పెరిగిందన్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రధాన రహదారిపై వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తుండటంతో పాదచారులు రోడ్డు దాటడం ప్రమాదకరంగా మారిందని పేర్కొన్నారు.

### ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం

వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు రహదారి దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాదచారుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ శాశ్వత ప్రాతిపదికన పాదచారుల వంతెనలు నిర్మించాలని కోరారు.

### లిఫ్ట్ సౌకర్యం తప్పనిసరి

కేవలం మెట్లతో వంతెనలు నిర్మించడం వల్ల వృద్ధులు, మోకాళ్ల సమస్యలున్న వారు, వీల్‌చైర్ ఉపయోగించే దివ్యాంగులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. చిన్నారులతో ప్రయాణించే మహిళలకు కూడా మెట్లు ఎక్కడం కష్టంగా ఉంటుందని తెలిపారు. అందువల్ల నారపల్లి ప్రాంతంలో నిర్మించే ప్రతి పాదచారుల వంతెనకు లిఫ్ట్ సౌకర్యం తప్పనిసరిగా కల్పించాలని ఆళవందార్ వేణు మాధవ్ కోరారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి నారపల్లి ప్రాంతంలో పాదచారుల వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

PRGI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# తప్పుడు మోతాదు.. తీరని నష్టం..!

- కంపెనీ ప్రతినిధుల తప్పుడు మోతాదు సూచనతో లక్షల పంట నష్టం.
- లబోదిబోమంటున్న రైతు.
- పంటను పరిశీలించిన ఏఈవో సరిత.
- బాధిత రైతుకు న్యాయం చేయాలని రైతు, ప్రజా సంఘాల డిమాండ్.



**మహబూబాబాద్, అక్టోబర్ 7 (జనం వాయిస్) :**

వ్యవసాయ రసాయనాల కంపెనీ ప్రతినిధులు సూచించిన మోతాదులో పురుగు మందును పిచికారీ చేసిన అనంతరం తన మిర్చి పంట దెబ్బతిందని మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు పరిధిలోని బేతోలు భజన తండాకు చెందిన గిరిజన రైతు గుగులోతు సీతారాం ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ ప్రతినిధులు సూచించిన అధిక మోతాదే పంట నష్టానికి కారణమై ఉండవచ్చని ఆయన ఆరోపించారు. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్చి పంటకు అవసరమైన పురుగు మందు కోసం ఆన్‌లైన్, ఫోన్ ద్వారా సంప్రదించగా హైదరాబాద్‌కు చెందిన ఎస్. కె రెడ్డి కెమికల్స్ (రంగారెడ్డి/హైదరాబాద్-- భోరోన్ కంపెనీ) ప్రతినిధులు కొరియర్ ద్వారా మందు పంపించారు. మందు వినియోగానికి సంబంధించి కంపెనీ ప్రతినిధులు సూచించిన మోతాదులోనే పిచికారీ చేసినట్లు రైతు తెలిపారు. సాధారణంగా ఎక్కువ పరిమాణంలో నీటిలో కలిపి పిచికారీ చేయాల్సిన మందును, తమకు సూచించిన విధంగా తక్కువ పరిమాణం నీటిలో కలిపి పిచికారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మందు పిచికారీ చేసిన కొద్దిసేపటికే మిర్చి మొక్కలు మాడిపోయి ఎండిపోవడం ప్రారంభించాయని, దీంతో పంటకు భారీగా నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

### పంటను పరిశీలించిన ఏఈవో సరిత..,

పంట నష్టంపై రైతు జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వ్యవసాయ విస్తరణ అధికారిణి ఏఈవో సరిత ఘటనా స్థలానికి చేరుకుని దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలించారు. పంట పరిస్థితి, వినియోగించిన మందు తదితర వివరాలను పరిశీలించి తదుపరి చర్యలకు అవసరమైన అంశాలను నమోదు చేసినట్లు తెలిసింది.

### సమగ్ర విచారణకు డిమాండ్

ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నల్లపు సుధాకర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి రైతుతో మాట్లాడి పంట నష్టం వివరాలను తెలుసుకున్నారు. రైతు ఆరోపణలపై వ్యవసాయ శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి, మందు మోతాదు, వినియోగ విధానం, పంట నష్టానికి గల కారణాలను శాస్త్రీయంగా నిర్ధారించాలని వారు కోరారు. విచారణలో కంపెనీ ప్రతినిధుల సూచనల వల్లే పంట నష్టం జరిగినట్లు తేలితే, సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత రైతుకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూక్య రాంజీ, షేక్ ఖాదర్ బాబా, భూక్య అర్జున్, భూక్య మన్సూర్, గుగ్గులోతు హచనా తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలి

- కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి.

**మహబూబాబాద్, అక్టోబర్ 7 (జనం వాయిస్) :**

సామాజిక అణచివేత, కుల వివక్ష, ఆర్థిక దోపిడీలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేపట్టాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలో కెవిపిఎస్ 29వ ఆవిర్భావ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ సీనియర్ నాయకులు అల్వాల ఆనంద్ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణ కార్యదర్శి మందుల మహేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దుడ్డెల రామ్మూర్తి మాట్లాడుతూ.. గత 28 ఏళ్లుగా కుల వివక్ష, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా కెవిపిఎస్ అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించిందన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం, శ్మశాన వాటికల కోసం 1235 జీవో, ఉచిత విద్యుత్ కోసం 382 జీవో వంటి అనేక హక్కుల సాధనలో కెవిపిఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ఈ ఉద్యమాల ద్వారా దళితులు, పేదలకు కెవిపిఎస్ భరోసాగా నిలిచిందన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మహిళలు, మైనార్టీలపై కుల వివక్ష, దాడులు, సాంఘిక బహిష్కరణలు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని రామ్మూర్తి ఆరోపించారు. ఇలాంటి ఘటనలను అరికట్టాల్సిన పాలకులే దాడులకు పాల్పడే వారికి అండగా నిలవడం, సన్మానాలు చేయడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మందుల మహేందర్, వ్యకాస పట్టణ కార్యదర్శి దేవత్ హేమనాయక్, సీఐటీయూ జిల్లా నాయకులు పులు బుజ్జ వెంకన్న, చేపూరి గణేష్, పులిపాక నాగరాజు, ఏర్పుగొండ యాదగిరి, కర్ణకంటి రాజు, ఎర్ర శ్రీనివాస్, నర రవి, ముత్క కుమారి, ఏర్పుగొండ లక్ష్మి, మహంకాళి సువార్త విజయ తదితరులు పాల్గొన్నారు.



# కుష్ఠు నిర్మూలనకు సమష్టి కృషి అవసరం

- ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించాలి.
- ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ.. మహబూబాబాద్‌లో సమీక్ష.



**మహబూబాబాద్, అక్టోబర్ 7 (జనం వాయిస్) :**

కుష్ఠు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి పూర్తి స్థాయిలో చికిత్స అందించడం ద్వారా వ్యాధిని నియంత్రించడంతో పాటు నిర్మూలించవచ్చని కేంద్ర పరిశీలకులు డాక్టర్ భాగ్యజ్యోతి, తెలంగాణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బాబు పేర్కొన్నారు. జిల్లాలో కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మహబూబాబాద్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర పరిశీలకులు డాక్టర్ భాగ్యజ్యోతి, రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బాబు, తెలంగాణ రాష్ట్ర లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ రాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ అనిత, సిబ్బందితో జిల్లాలో కుష్ఠు వ్యాధి గుర్తింపు, చికిత్స, నివారణ, నిర్మూలన కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. అనంతరం ఐడీఓసీలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. చర్మంపై కనిపించే అనుమానిత మచ్చలను పరిశీలించడం, వ్యాధి లక్షణాలను తొలిదశలో గుర్తించడం, అనుమానితులను వైద్య పరీక్షలకు పంపించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి అవసరమైన చికిత్స అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

### విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

5 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల పాఠశాల విద్యార్థుల్లో కుష్ఠు వ్యాధి లక్షణాలను ప్రత్యేకంగా పరిశీలించాలని ఆర్‌బీఎస్‌కే సిబ్బందికి సూచించారు. అనుమానిత కేసులను వెంటనే గుర్తించి వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో వారి కుటుంబ సభ్యులను కూడా పరీక్షించాలని తెలిపారు.

### వివక్షకు తావివ్వొద్దు

కుష్ఠు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి అవసరమైన వైద్య, ఆరోగ్య సేవలు అందించాలని అధికారులు సూచించారు. ప్రజల్లో వ్యాధిపై అపోహలు తొలగించి అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మహబూబాబాద్ జిల్లాను కుష్ఠు వ్యాధి రహిత జిల్లాగా కొనసాగించేందుకు అన్ని స్థాయిల ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చెరువుకట్టకు పక్కా దారి

*నేరడలో ఏళ్ల ఇబ్బందులకు పరిష్కారంగా సీసీ రోడ్డు.*
*సర్పంచ్ ఇరుగు గౌతమి వెంకన్న ఆధ్వర్యంలో పనులు ప్రారంభం.*

**కురవి, అక్టోబర్ 7 (జనం వాయిస్):**

చెరువుకట్టకు వెళ్లేందుకు ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేరడ గ్రామస్థులకు ఊరట కలిగించేలా సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సర్పంచ్ ఇరుగు గౌతమి వెంకన్న ఆధ్వర్యంలో రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, ఎంపీ సహకారంతో ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు గ్రామస్థులు తెలిపారు. శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ చైర్మన్ కుర్ను రవీందర్‌రెడ్డి కూడా పనులకు సహకారం అందించారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే చెరువుకట్ట వైపు వెళ్లే రైతులు, గ్రామస్థులకు రాకపోకలు సులభతరం కానున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే రహదారి ఇబ్బందులు తొలగనున్నాయని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. పనుల ప్రారంభ కార్యక్రమంలో పార్టీలకతీతంగా గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మదూరు రఘు, కార్యదర్శి షేక్ నజీర్, ఉపసర్పంచ్ దుస వెంకన్న, వార్డు సభ్యులు నీరుడు మారతమ్మ, షేక్ సాధిక్, కుదురుపాక వెంకన్న, జక్కుల రమేష్, అనంతల జ్యోతి, మాజీ ఎంపీటీసీ కడియం సత్యం పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరెడ్ల వెంకట్‌రెడ్డి, కొలిపాక రాములు, నాయకులు రామ్మూర్తి, సిరుగాని లాలయ్య, చిరుగాని యాకయ్య, నీరుడు బాబురావు, ఇరుగు శ్రీను, మారగాని ఉపేందర్, కోల భిక్షం, కోల వీరన్న, వేంశెట్టి వెంకన్న, కొర్ను కృష్ణారెడ్డి, దుర్గామాత సభ్యులు దుబ్బాకుల అశోక్, మైల కృష్ణ తదితరులు హాజరయ్యారు.



# బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి సత్యవతి పరామర్శ

- అనారోగ్యంతో ఉన్నవారిని పరామర్శించి ఆర్థిక సాయం.
- మృతుల కుటుంబాలకు పరామర్శ.







**కురవి, అక్టోబర్ 7 (జనం వాయిస్) :**

కురవి మండలంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ బుధవారం పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, ప్రమాదాల్లో గాయపడిన వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### బంచరాయితండాలో బాధితులకు ఆర్థిక భరోసా

బంచరాయితండాకు చెందిన పత్రికా విలేకరి దేవన్న తండ్రి బానోత్ సక్రం ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా సత్యవతి రాథోడ్ ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయం అందించారు. అదే గ్రామానికి చెందిన నునావత్ శ్రీను ఇటీవల ప్రమాదానికి గురై, వైద్యుల సూచన మేరకు కాలు తొలగించాల్సి వచ్చింది. చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న శ్రీనును సత్యవతి రాథోడ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయం అందించారు.

### గుండ్రతిమడుగులో బాధిత కుటుంబాలకు పరామర్శ

అనంతరం గుండ్రతిమడుగు గ్రామంలో సత్యవతి రాథోడ్ పర్యటించారు. ప్రమాదానికి గురైన ఎండీ రషీదా గౌస్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అలాగే ఇటీవల మృతి చెందిన కోటపాటి వెంకన్న కుటుంబాన్ని పరామర్శించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఎస్.కె. అలీమా రంజాన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ నునావత్ వీరన్న, మాజీ ఎంపీటీసీ వీరు నాయక్, తేజ నాయక్, సేత్య, శరత్, ఐలి నరహరి గౌడ్, బోడ శ్రీను నాయక్, వెన్నమల్ల అజయ్, ఎస్.కె. రంజాన్, బస్వ శ్రీనివాస్, చిరబోయిన బిక్షం, ఎండీ గౌస్, కారం సందీప్, పోలోజి యాదగిరి తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బండి సదానంద యాదవ్‌ను పరామర్శించిన జర్నలిస్టులు

**జనం వాయిస్ మందమర్రి అక్టోబర్ 7:**



మందమర్రి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీనియర్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, జాతీయ యాదవ సంఘం నాయకులు బండి సదానంద యాదవ్‌ను మందమర్రి పట్టణ జర్నలిస్టులు బుధవారం ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ప్రమాదంలో గాయాల నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ధైర్యంగా ఉండాలని, త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజా జీవితంలోకి తిరిగి రావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు కాగితపు శ్రీనివాస్ బైరి రవీందర్ పెండ్యాల గౌతం పారిపెల్లి శివరామకృష్ణ బత్తుల సతీష్ బాబు మంతెన రాజశేఖర్ జర్నలిస్టులు, సభ్యులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల నుంచి రక్షణకు అప్రమత్తతే ఆయుధం

- ఫేక్ ఆఫర్లు, డిజిటల్ అరెస్ట్‌లను నమ్మొద్దు.. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి.
- సైబర్ సురక్షిత సమాజ నిర్మాణంలో విద్యార్థులదే కీలక పాత్ర : జిల్లా ఎస్పీ డా. శబరీష్





**కురవి, అక్టోబర్ 7 (జనం వాయిస్) :**

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటమే వాటి బారిన పడకుండా రక్షించుకునేందుకు ప్రధాన ఆయుధమని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ అన్నారు. కురవి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్య, బ్యాంకింగ్, షాపింగ్, కమ్యూనికేషన్ వంటి ప్రతి రంగంలో సాంకేతికత వినియోగం పెరిగిన నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల కూడా అప్రమత్తత అవసరమన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, డిజిటల్ పేమెంట్స్, ఆన్‌లైన్ షాపింగ్ వంటి వాటిని ఉపయోగించే సమయంలో వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు.

ఫేక్ ఆఫర్లు, బహుమతుల పేరుతో మోసాలకు గురికావద్దు

పండుగలు, ప్రత్యేక సందర్భాలను ఆసరాగా చేసుకుని తక్కువ ధరలు, భారీ డిస్కౌంట్లు, ఉచిత బహుమతులు, లక్కీ డ్రాలు అంటూ సైబర్ నేరగాళ్లు పంపే ఫేక్ లింకులు, మెసేజ్‌లను నమ్మవద్దన్నారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయడం, తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం ద్వారా వ్యక్తిగత, ఆర్థిక సమాచారం నేరగాళ్ల చేతికి వెళ్లే అవకాశం ఉందని హెచ్చరించారు.

**డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులకు భయపడొద్దు**

పోలీసులు, సీబీఐ, ఈడీ, కోర్టు అధికారులు అంటూ వీడియో కాల్స్ చేసి కేసుల పేరుతో బెదిరించడం, విచారణ పేరుతో గంటల తరబడి ఆన్‌లైన్‌లో ఉంచడం, డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడం వంటి డిజిటల్ అరెస్ట్ మోసాలు పూర్తిగా నకిలీవని ఎస్పీ స్పష్టం చేశారు. నిజమైన ప్రభుత్వ సంస్థలు వీడియో కాల్‌లో అరెస్ట్ చేసి డబ్బులు చెల్లించాలని ఆదేశించవని తెలిపారు. ఇలాంటి కాల్స్ వస్తే భయపడకుండా వెంటనే కాల్‌ను డిస్‌కనెక్ట్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

**ఫేక్ ఐడీలు, సోషల్ మీడియా మోసాలపై జాగ్రత్త**

సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలు పంచుకోవద్దని ఎస్పీ సూచించారు. ఇతరుల పేరుతో సృష్టించిన ఫేక్ సోషల్ మీడియా ఖాతాలు, ఫేక్ ప్రొఫైల్స్ ద్వారా మోసాలు జరిగే అవకాశం ఉందన్నారు. స్నేహితులు లేదా బంధువుల పేరుతో డబ్బులు అడిగే మెసేజ్‌లు వచ్చినప్పుడు, వారికి నేరుగా ఫోన్ చేసి నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలని తెలిపారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కూడా సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, వృద్ధులు సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా పిల్లలు వారికి డిజిటల్ భద్రతపై వివరించాలని అన్నారు.

**మోసానికి గురైతే వెంటనే 1930కు సమాచారం**

ఆన్‌లైన్ ఆర్థిక మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు. వీలైనంత త్వరగా ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన మొత్తాన్ని నిలిపివేసే అవకాశం ఉంటుందని చెప్పారు. సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసులతో పాటు ప్రజలు, విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచి ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలని, సైబర్ నేరాలపై తమకు తెలిసిన సమాచారాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులతో పంచుకోవాలని ఎస్పీ సూచించారు. అప్రమత్తత, అవగాహన, బాధ్యతాయుతమైన డిజిటల్ వినియోగంతోనే సైబర్ సురక్షిత సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు.

# యువ మోర్చ మండల అధ్యక్షునిగా వినయ్ కుమార్

**అక్టోబర్ 7 జనం వాయిస్ పాలకుర్తి:**



భారతీయ జనతా యువ మోర్చా ( బీజేవైఎం) పాలకుర్తి మండల అధ్యక్షుని గా చెన్నూర్ గ్రామానికి చెందిన తండా వినయ్ కుమార్ గౌడ్ నియమితులయ్యారు.. గతంలో బీజేవైఎం సోషల్ మీడియా కన్వీనర్ గా పనిచేసిన ఆయన అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. ఈ సందర్భంగా ఆయన నియామకానికి సహకరించిన బిజెపి జనగాం జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, బిజెవైఎం జనగాం జిల్లా అధ్యక్షుడు హరీష్, రాష్ట్ర నాయకులు లేగ రామ్మోహన్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు దొంగరిమహేందర్, పాలకుర్తి మండల అధ్యక్షులు మారం రవికుమార్, మాజీ మండల అధ్యక్షుడు కమ్మగాని శ్రీకాంత్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు వేల్పుల దేవరాజ్, పెనుగొండ సోమేశ్వర్ లకు వినయ్ కృతజ్ఞతలు తెలిపారు.

PRGI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# బిఆర్ఎస్ విస్తృత స్థాయి సన్నాహక సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

**అక్టోబర్ 7 జనం వాయిస్ పాలకుర్తి:**

జనగామ జిల్లా రాబోయే ఖమ్మం - నల్గొండ - వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవడమే లక్ష్యంగా బుధవారం జనగామ జిల్లా పార్టీ కార్యాలయంలో పాలకుర్తి, జనగామ, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సన్నాహక సమావేశం జరుగగా, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఏనుగుల రాకేష్ రెడ్డి, బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు, పళ్ళ సామ సుందర్ రెడ్డి బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ మంగళపల్లి శ్రీనివాస్ పుష్కూరు శ్రీనివాసరావు గాంధీ నాయక్ ఆయా మండలాల అధ్యక్షులు, పసునూరి నవీన్ తీగల దయాకర్ గౌడ్ సింధు రామోజీ మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# చిన్న కంజర్లలో బతుకమ్మ నిమజ్జనంకు ఘాట్ ఏర్పాట్లు

## కౌన్సిలర్ మల్లేపల్లి శ్రీనివాస్

**జనం వాయిస్, పఠాన్ చెరు, అక్టోబర్ 07:**



ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని చిన్న కంచర్ల గ్రామంలో తెలంగాణలో జరిగే సద్దుల బతుకమ్మ, పండుగ సందర్భంగా కంచర్ల లోని కోపు చెరువు వద్ద ఘాట్ (మెట్లు ) పనులు ఇంద్రేశం మున్సిపాలిటీ చిన్న కంచర్ల, 1వ వార్డు కౌన్సిలర్ మల్లెపల్లి శ్రీనివాస్,18వ వార్డు కౌన్సిలర్ భూపాల్ గౌడ్, పనులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ మల్లేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే తెలంగాణ ప్రతీకగా నిలిచే పండుగ బతుకమ్మ పండుగ, సద్దుల బతుకమ్మ చిన్న కంజర్లలో జరిగే పండుగకు మహిళలకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా చెరువు దగ్గర, లైట్లు మరియు మెట్లు ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దిల్ ఆర్ కృష్ణ, రామచంద్రారెడ్డి, నాగభూషణం, మున్సిపాలిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం రవాణాకు చెక్ పెట్టాలి.

- అధికారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచనలు.
- ఎమ్మెల్యే శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి.

**జనం వాయిస్, షాద్‌నగర్, అక్టోబర్ 07:**



నియోజకవర్గంలో అక్రమ మద్యం రవాణా, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విధి నిర్వహణలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. బుధవారం షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి ఎమ్మెల్యే శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

**అక్రమ మద్యానికి అడ్డుకట్ట పడాలి.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎక్సైజ్ శాఖ పనితీరు, బెల్ట్‌షాపుల పరిస్థితి, అక్రమ మద్యం రవాణా తదితర అంశాలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. అక్రమ మద్యం సరఫరా, రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి మొహమాటం లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు

**ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి!**

ఎక్సైజ్ అధికారులు విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరించడంతో పాటు సామాన్య ప్రజల పట్ల స్నేహపూర్వకంగా, మర్యాదగా మెలగాలని ఎమ్మెల్యే సూచించారు. యువత, ప్రజల ఆరోగ్యంపై మద్యం ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎక్సైజ్, పోలీస్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. అక్రమ మద్యం, బెల్ట్‌షాపులపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు.

# ఢిల్లీ గడ్డపై వంశీకృష్ణ పోరుబాట

- బస్సుపై నిలబడి ప్రజాస్వామ్యానికి జైకొట్టిన పెద్దపల్లి ఎంపీ.
- ప్రజల ఓటు హక్కు కోసం వెనక్కి తగ్గేది లేదని స్పష్టీకరణ.
- నిరసనలో కార్యకర్తలతో కలిసి నినాదాలు.
- ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పోరాటం.
- ఎలాంటి ఆంక్షలు వచ్చినా ఉద్యమం ఆగదని వెల్లడి.

**జనం వాయిస్, న్యూఢిల్లీ, అక్టోబర్ 7:**




ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల ఓటు హక్కు కోసం ఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్సుపై నిలబడి కార్యకర్తలతో కలిసి నినాదాలు చేస్తూ నిరసనకు మద్దతు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన సందేశాన్ని నినాదాల ద్వారా వినిపించారు. ప్రజల ఓటు హక్కు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ఎలాంటి ఒత్తిళ్లు, ఆంక్షలు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదని వంశీకృష్ణ స్పష్టం చేసినట్లు ఆయన వర్గాలు తెలిపాయి. ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ప్రజల గొంతును అణచివేసే ప్రయత్నాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎదుర్కొంటామని ఆయన అన్నారు. అడ్డంకులు ఎన్ని వచ్చినా ప్రజల ఓటు హక్కు కోసం తమ పోరాటం కొనసాగుతుందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చివరి వరకు పోరాడతామని వంశీకృష్ణ పేర్కొన్నారు.

# 177 ప్రభుత్వ భూమి సర్వేకు 172 లింకేంటి..?

- అధికారుల నోటీసులపై ఫిర్యాదుదారుల తీవ్ర అభ్యంతరం.
- కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారా?
- తప్పుడు సర్వే చేయాలని చూస్తున్న జిల్లా సర్వేయర్ పై కోర్టుకు వెళ్తాం.
- నూతక్కి సాంబశివరావు, ఇరుగు వెంకన్న.

**కురవి, అక్టోబర్ 7 (జనం వాయిస్) :**

మహబూబాబాద్ జిల్లా కురవి మేజర్ గ్రామ పంచాయతీ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 177లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు హద్దులు నిర్ణయించి, కొలతలు వేసి, రక్షణ కల్పించడంతో పాటు ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేయాలని కురవి సీనియర్ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు, వార్డు సభ్యులు దైద భద్రయ్య, మాజీ వార్డు సభ్యుడు ఇరుగు వెంకన్న, దళిత నాయకుడు కిన్నెర మల్లయ్య తదితరులు జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ భూమిని పరిశీలించి, నిబంధనల ప్రకారం సర్వే చేపిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల జిల్లా సర్వేయర్, గ్రామ



రెవెన్యూ అధికారి ద్వారా జారీ చేసిన నోటీసుల్లో సంబంధం లేని వ్యక్తులకు నోటీసులు ఇవ్వడం, నిబంధనల ప్రకారం పూర్తి స్థాయిలో నోటీసులు జారీ చేయకపోవడంతో ఫిర్యాదుదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇటీవల సర్వే వాయిదా పడింది.

**మళ్లీ నోటీసులు.. మళ్లీ వివాదం..,**

తాజాగా బుధవారం మరోసారి నోటీసులు జారీ చేయడంతో ఫిర్యాదుదారులు నూతక్కి సాంబశివరావు, ఇరుగు వెంకన్న విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 177లోని ప్రభుత్వ భూమిని రక్షించాలని ఫిర్యాదు చేస్తే, సంబంధం లేని సర్వే నంబర్ 172ను ఇందులోకి తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. 177 సర్వే నంబర్‌కు సంబంధించిన భూమిపై మాత్రమే నోటీసులు జారీ చేసి సర్వే చేపట్టాల్సి ఉండగా, 172 సర్వే నంబర్ భూమిని కూడా సర్వే చేస్తామని జిల్లా సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా నోటీసులు జారీ చేయడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు.

**172ను లింక్ చేయడం వెనుక అంతర్యమేంటి?**

ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరితే, సంబంధం లేని సర్వే నంబర్‌ను ఎందుకు తెరపైకి తెస్తున్నారని వారు నిలదీశారు. తప్పుడు సర్వే ద్వారా అసలు ప్రభుత్వ భూమి అంశాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందా? కబ్జాదారులతో అధికారులు కుమ్మక్కయ్యారా? అనే అనుమానాలను వారు వ్యక్తం చేశారు. తక్షణమే ప్రస్తుత సర్వేను వాయిదా వేసి, కేవలం సర్వే నంబర్ 177లోని ప్రభుత్వ భూమిపై నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, సమగ్ర సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**లేకుంటే కోర్టు బాట..,**

సర్వే నంబర్ 177 ప్రభుత్వ భూమికి స్పష్టమైన హద్దులు నిర్ణయించి, భూమిని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే, సర్వే నంబర్ 177 భూమి వ్యవహారంపై సమగ్ర విచారణ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వారు హెచ్చరించారు. ప్రభుత్వ భూమి పరిరక్షణ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, 177 సర్వే నంబర్‌కు సంబంధించిన వాస్తవ పరిస్థితులను నిష్పక్షపాతంగా నిర్ధారించి, భూమిని కబ్జాకు గురికాకుండా రక్షించాలని వారు డిమాండ్ చేశారు.

# కిసాన్‌నగర్‌లో బీఆర్ఎస్‌లోకి భారీగా యువత చేరిక

- గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ మంత్రి గంగుల కమలాకర్.
- 28, 29, 30 డివిజన్లకు చెందిన పలువురు యువకులు పార్టీలో చేరిక.
- యువత ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ.
- మంగళహారతులతో గంగులకు మహిళల స్వాగతం.
- కిసాన్‌నగర్‌లో రూ.65 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని గంగుల వెల్లడి.
- ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని ప్రకటన.

**జనం వాయిస్, కరీంనగర్, అక్టోబర్ 7:**

నగరంలోని కిసాన్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమంతో సందడి నెలకొంది. 28, 29, 30 డివిజన్లకు చెందిన పలువురు యువకులు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కిసాన్‌నగర్ గాంధీచౌక్ నుంచి యువకులు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ జెండాలు, నినాదాలతో ర్యాలీ కొనసాగింది. స్థానిక మహిళలు మంగళహారతులతో గంగుల కమలాకర్‌కు స్వాగతం పలికారు. అనంతరం గంగుల కమలాకర్ యువకులతో కలిసి ద్విచక్ర వాహనం నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధికి బాట**



కిసాన్‌నగర్ ప్రాంత అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బాట పడిందని గంగుల కమలాకర్ అన్నారు. గతంలో మట్టి రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కిసాన్‌నగర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు.

**రూ.65 కోట్లతో అభివృద్ధి పనులు**

కిసాన్‌నగర్‌లో సుమారు రూ. 65 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు గంగుల తెలిపారు. గల్లీల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు వివరించారు.

**బీఆర్ఎస్‌లో చేరిన యువత**

పండు సుమిత్, కందుకూరి శివకుమార్, శాంబోరి శ్యామ్, సునావల్ శేఖర్, వడ్లూరి ప్రశాంత్, మెదిరి వామన్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గంగుల కమలాకర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కొత్తగా పార్టీలో చేరిన వారిని కుటుంబ సభ్యులుగా భావించి గౌరవిస్తామని ఆయన అన్నారు.

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు**

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ గౌడ్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, కార్పొరేటర్లు యూసుఫ్, ఆలీ, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, యువకులు, కార్యకర్తలు, మహిళలు, బీఆర్ఎస్ అభిమానులు పాల్గొన్నారు. యువత భారీగా ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించడంతో కిసాన్‌నగర్‌లో కొద్దిసేపు సందడి వాతావరణం నెలకొంది.

# విద్యాశాఖ పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- ప్రతి కాంప్లెక్స్‌లో ఎఫ్ఎల్ఎన్ అమలుపై నిరంతర సమీక్ష.
- పదో తరగతిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ.
- పాఠశాలల్లో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ.
- మధ్యాహ్న భోజనం, అల్పాహారం నాణ్యతపై ప్రత్యేక దృష్టి.

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 7:**

విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం విద్యాశాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాఠశాలల్లో విద్యాభ్యాస కార్యక్రమాల అమలు, విద్యార్థుల అభ్యసన స్థాయి, ఎఫ్ఎల్ఎన్ అమలు, పదో తరగతి ఫలితాలు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం తదితర అంశాలను సమీక్షించారు. ప్రతి మండలంలోని పాఠశాలల్లో విద్యాభ్యాసానికి సంబంధించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. మండల విద్యాశాఖ





అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ పెండింగ్ పనులను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి**

విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు అవసరమైన బోధనా పద్ధతులను అమలు చేయాలని, అవసరమైన అదనపు బోధన అందించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని తెలిపారు.

**ఎఫ్ఎల్ఎన్‌పై నిరంతర సమీక్ష**

ప్రతి కాంప్లెక్స్ పరిధిలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం అమలుపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఏ పాఠశాలలో ఏ అంశంలో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో గుర్తించి, వారి అభ్యసన పురోగతికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక కార్యాచరణ**

ఎ ద లో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులను ముందుగానే గుర్తించి అదనపు బోధన అందిస్తూ ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**పాఠశాలల్లో పారిశుద్ధ్యంపై దృష్టి**

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం, అల్పాహారం నాణ్యతగా ఉండేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి మండల విద్యాశాఖ అధికారి తమ పరిధిలోని పాఠశాలలను నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by GATTU MAHESH, Printed at M R PUBLICATIONS, # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A, VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. PRGI NO: TGTEL/26/A0383, CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com